క్లుప్తంగా

గోదాదేవికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గీతామందిరంలో పుష్యమాసాన్ని పురస్కరించుకొని గోదారంగనాథ స్వామికి బుధవారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు రాజేంద్ర శర్మ స్వామివార్లకు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలుచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. గీతాభజనమండలి ఆధ్వర్యంలో లలితా సహస్త్రనామ పారాయణ చేశారు.

రేపు ఉత్తరద్వార దర్శనం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తరద్వారదర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవదాయధర్మాదాయ శాఖ ఈవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయం, పానుగుపాడులోని ఆంజనేయ స్వామి ఆలయం, కండ్రికలోని రామాలయం, యర్రగుంట్లపాడులోని రుక్మిణీ సత్యభామాస మేత వేణుగోపాల స్వామి ఆలయాల్లో శుక్రవారం ఉదయాన్నే 5 గంటలకు భక్తులకు ఉత్తరద్వార దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామివార్లకు విశేషపూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారని చెప్పారు. ఫిరంగిపురంలోని వేణుగోపాలస్వామి వారికి సాయంత్రం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం ఉంటుందన్నారు.

కొనసాగుతున్న క్లాప్ ఆటోడ్రైవర్ల సమ్మె



మంగళగిరి (తాడేపల్లిరూరల్): నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద క్లాప్ ఆటో డ్రైవర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న ధర్నా బుధవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, నాయకుడు టి. శ్రీరాములు, సీపీఎం మంగళగిరి మండల కార్యదర్శి యూత్ దుర్గారావులు శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలియజేసి మాట్లాడారు. క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం అమలు చేయాలని, నెలకు వేతనం రూ.24,500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యూనియన్ అధ్యక్షుడు డి.శివ, కార్యదర్శి ఎం.రవి, యూనియన్ నాయకులు ఆర్.కృష్ణ, వై.శివ, పి.శ్రీనివాసరావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు సీజ్



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో ప్లాస్టిక్ విక్రయ దారుల నుంచి సుమారు 25 కేజీల ప్లాస్టిక్ సంచులను బుధవారం సీజ్ చేసినట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించామని ఈ తనిఖీలలో సుమారు 25 కిలోల ప్లాస్టిక్ సంచులను సీజ్ చేశామని, నిబంధనలు అతిక్రమించిన వారికి ఇకపై భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతిఒక్కరు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ఇంటి నుంచి వస్త్రంతో లేదా పేపర్‌తో లేదా జూట్‌తో తయారు చేసిన సంచులను మాత్రమే వెంట తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, వినియోగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలీమ్‌బాషా అన్నారు.

9, 10తేదీల్లో ఉచిత వైద్యసేవలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళగిరి దక్షిణ గాలిగోపురం రోడ్డులోని మహేష్ క్లినిక్‌లో ఉమా యాదవ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9,10 తేదీలలో ఉచిత వైద్యసేవలు, అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాడిబోయిన మహేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉత్తరద్వార దర్శనం, శంకుతీర్థంకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు, యాత్రికులకు క్లినిక్‌లో ఉచిత వైద్యసేవలను అందించి, మందులు పంపిణీ చేయనున్నామని, 9వ తేదీ సాయంత్రం నుంచి 10వ తేదీ రాత్రి వరకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని, ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు అత్యవసర పరిస్థితులలో అవసరమైన వారికి ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించనున్నామని, అవసరమైన భక్తులు, యాత్రికులు వైద్యసేవలను, అంబులన్స్ సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ తాడిబోయిన మహేష్ కోరారు.

తలరాతను మార్చే బోధకుడు!

- గుండ్రటి చేతిరాతతో మార్కులు
- మనస్సుకు హత్తుకొనేలా అక్షరాలు
- విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు జున్నూ సాహెబ్
- ఉపాధ్యాయులకు సైతం శిక్షణ..



చేతిరాతలో శిక్షణనిస్తున్న ఉపాధ్యాయుడు జున్నూ సాహెబ్

ఫిరంగిపురం: పరీక్షల్లో మార్కులు సాధించాలంటే అందమైన చేతిరాత కీలకం. పరీక్షా పత్రంలో సమాధానాలు మనస్సును హత్తుకునేలా రాత ఉండి జవాబు సరిగా రాసినట్లయితే చూసేవారికి అధిక మార్కులు వేయాలని పిస్తుంది. పదోతరగతి మరియు ఇంటర్, డిగ్రీపరీక్ష వార్షిక పరీక్షల్లో అధిక మార్కులు సాధించాలంటే గుండ్రటి దస్తూరి తప్పనిసరి, పరీక్షల సమయంలో సహజంగానే హడావుడి, ఆందోళన ఉంటుంది. మొదటి ప్రశ్నకు సమాధానంగా అక్షరాలు సరిగారాసి వేగం పెంచిన తరువాత అదే తరహా కొనసాగించలేకపోతుంటారు. దీన్ని అధిగమించాలంటే ముందస్తుగా గుండ్రటి చేతరాతను సాధన చేయాలి.. పరీక్షల్లో ఇబ్బందితలెత్తకుండా విద్యార్థులకు ఉచితంగా (లూసీదా శైలి) చేతరాతలో శిక్షణ ఇస్తున్నారు ఉపాధ్యాయుడు జున్నూసాహెబ్.

ఎందరికో చేతిరాత గురువు..

మండలంలోని గుండాల పాడు గ్రామానికి చెందిన షేక్ జున్నూసాహెబ్ తండ్రి ఉపాధ్యాయుడు అయిన షేక్ మస్తాన్‌వలి వద్ద లూసీదా శైలి(గుండ్రటి చేతిరాత)ను నేర్చుకున్నాడు. ఫిరంగిపురంలో నివాసముంటూ వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం, సొలసలో పనిచేస్తుంటాడు. తాను నేర్చుకున్న గుండ్రటి చేతిరాత మరికొందరు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు నేర్పించాలని భావించాడు. తానెంతో ఇష్టంగా నేర్చుకున్న చేతిరాతను మరి కొందరికి నేర్పితే వారు చక్కగా రాస్తారు కదా అనే ఆలోచన వచ్చిందే తడవు ఆచరణలో పెట్టాడు.

ఉపాధ్యాయులకు సైతం..



విద్యార్థులు రాసిన లూసీదా శైలి చేతి రాత

తాను సెలవు పెట్టుకొని మరికొన్ని పాఠశాలలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు గుండ్రటి చేతిరాతలో శిక్షణ ఇచ్చాడు. అలా ఇప్పటికే 60 పాఠశాలల్లో సుమారు 16వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాడు. అంతేకాక కొందరు ఉపాధ్యాయులు చేతిరాతపై ఉత్సాహం చూపించడంతో వారికి సెలవుల్లో సైతం శిక్షణ ఇచ్చాడు. అలా ఇప్పటికే 600 మంది ఉపాధ్యాయులకు గుండ్రటి చేతిరాతలో శిక్షణ ఇచ్చాడు.

పదివేల పుస్తకాలు అందజేత..

చేతిరాత నేర్చుకునేలా ఉండే పుస్తకాలు తానే రూపకల్పన చేసి సొంత ఖర్చుతో ముద్రించి నేర్చుకొనే వారికి ఇస్తుంటాడు. శిక్షణ అయిన తరువాత కొద్ది రోజులు పుస్తకాలలో రాస్తుండమని చెబుతుంటాడు.

ఎన్నో అవార్డులు..

తాను నేర్చుకున్న అంశంలో మరికొందరికి శిక్షణ ఇవ్వడాన్ని గుర్తించిన ప్రభుత్వ అధికారులు జున్నూ సాహెబ్‌ను మెచ్చుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ వికాస్ గుంటూరు నేషనల్ బిల్డర్ అవార్డు అందుకున్నాడు. అలాగే 2023లో 230 మందికి డబుల్ పెన్సిల్ గుండ్రటి చేతిరాతలో శిక్షణ ఇచ్చి వారిలో 170 మందితో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సాధించాడు. అంతేకాక ప్రతి ఏటా ముంబయి కేంద్రంగా నేషనల్ లెవల్, మరియు ఇంటర్నేషనల్ లెవల్ రంగోత్సవ్ కాంపిటేషన్స్‌లో ఎన్నో అవార్డులు పొందాడు.

చేతిరాతకు గుర్తింపుగా డాక్టరేట్ ..

గుండ్రటి చేతిరాతను నేర్పించినందుకుగాను జీహెచ్‌ఆర్డీ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సభలో జున్నూసాహెబ్ గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నాడు. అంతేకాక వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపించినవారికి మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో అవార్డు ఇస్తారు. ఇటీవల హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జున్నూసాహెబ్‌కు గురుపురస్కార్ అవార్డును ఇచ్చారు.

నా చేతిరాతను తీర్చిదిద్దారు..



నాకు ఎప్పటినుంచో గుండ్రటి చేతిరాత నేర్చుకోవాలనే ఆకాంక్ష ఉండేది. అది జున్నూసాహెబ్ ద్వారా తీరింది. నా చేతి రాతను సైతం మాస్టారు తీర్చిదిద్దారు. నేను ఇప్పుడు గుండ్రంగా అక్షరాలు రాస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది. ఎందరో ఉపాధ్యాయులు, విద్యార్థులకు కూడా చేతిరాతలో శిక్షణ ఇచ్చారు.

– బి.ఊర్ధురాజు, ఉపాధ్యాయుడు, ఎంపీయూపీఎస్, కొండవీడు

అద్భుతంగా ఉంది..



నేను ఐదోతరగతి చదువుతున్నాను. మాస్టారు ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొని నేను గుండ్రటి చేతిరాత నేర్చుకున్నాను. నాచేతిరాత ఎంతో అద్భుతంగా ఉంది. ఎందరో మెచ్చుకుంటున్నారు.

– అమూల్య, విద్యార్థిని, ఎంపీపీఎస్ (ఏఏ), సొలస

చదువుపై ఆసక్తి పెరిగింది..



నేను పదోతరగతి చదువుతున్నాను. గతంలో నేను రాస్తుంటే అందరు నవ్వేవారు. నాచేతిరాత బాగుండేదికాదు. మాస్టారి శిక్షణలో నేర్చుకొనడంతో ఇప్పుడు నాచేతిరాత ఎంతో బాగుంది. దీంతో చదువుపై నాకు ఆసక్తి పెరిగింది.

– రాజమణి, విద్యార్థిని, జెడ్పీహెచ్ఎస్, సొలస

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



'నిర్మల ప్లే ఆఫ్స్ 2025' ను ప్రారంభిస్తున్న కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరి, కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అన్నారు. బుధవారం మంగళగిరిలోని కళాశాలలో నిర్మల ప్లే ఆఫ్స్–2025 కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మల జ్యోతి మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిగత అభివృద్ధికి, ఆరోగ్యకరమైన జీవితానికి ఎంతో దోహదం చేస్తాయని, ఆటలలో పాల్గొనడం ద్వారా నాయకత్వం లక్షణాలను పెంపొందించుకోవచ్చని ఆమె వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల రెడ్డి మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరుచుకోవాలని సూచించారు. నిర్మల ప్లే ఆఫ్స్–2025 కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.సౌజన్య, ఖోఖో కో–ఆర్డినేటర్ ఆ.రత్న, మంజుల, వి.జోజిబాబు, కళాశాల వివిధ విభాగాధిపతులు డాక్టర్ హరేకృష్ణ రాయ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ షేక్ ఆశాబేగం, డాక్టర్ జి.స్వప్న, డాక్టర్ షేక్ ఆలీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, బి.ఫార్మసీ, డీఎం ఫార్మసీ, డి ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన



నమూనా చిత్రాలు గీసి అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం గ్రామీణ పనులు, అవగాహన, అనుభవ కార్యక్రమాన్ని పెదవడ్లపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు గ్రామంలోని వసతులు, సాగుభూమి విస్తరణ, గ్రామ మరియు పంటల సమస్యలు తెలిపే విధంగా చిత్రాలు గీసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల అడిషనల్ హెచ్‌ఓడీ డాక్టర్ జె.ఆర్.రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులకు సెమిస్టర్‌లో భాగంగా గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించామని, విద్యార్థులు రైతులతో కలసి తాము చదువుకున్న విషయాలను, ప్రస్తుతం జరుగుతున్న దానిని తెలుసుకుంటారని, విద్యార్థులు వ్యవసాయంలో తెలుసుకున్న ఆధునిక పద్ధతులు రైతులకు వివరిస్తూ, రైతుల అనుభవాలను తెలుసుకుంటారని అన్నారు. కళాశాల ఉపాధ్యాయుడు జి.సాయి వంశీరెడ్డి, రైతులు యేళ్ల శివరామయ్య, ముసునూరి శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై ఇంటింటి అవగాహన..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ బీసీఏ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులో స్త్రీ, పురుష సమానత్వంపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో కొన్ని ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ఉన్నాయని, అటువంటివి సమాజానికి మంచిది కాదని, ఇలా ప్రవర్తించడం సరి కాదని ఆయన అన్నారు. బీసీఏ విభాగాధిపతి డాక్టర్ కె. భగవాన్, ఆచార్యులు డాక్టర్ బి.కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణిలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కో–ఆర్డినేటర్ పి.సురేష్ సమన్వయకర్తగా వ్యవహరించగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి తదితరులు వలంటీర్లను అభినందించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం కావాలి



ఫణిదరంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- ఫణిదరం, బండారుపల్లి, గరికపాడు గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు

ఫణిదరం(తాడికొండ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, గుంటూరు నగర డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్‌బాబు) పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా గ్రామాల పర్యటనను ప్రారంభించిన ఆయన బుధవారం తాడికొండ మండలం ఫణిదరం, బండారుపల్లి, గరికపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో చర్చించి ప్రజా సమస్యలు, ఇబ్బందులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని పక్షపాత ధోరణితో పేద ప్రజలను ఇబ్బందులు గురిచేస్తే సహించవద్దన్నారు. ఇటీవల కాలంలో అధికార పక్షం నేతలు అణచివేత ధోరణితో వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తుందని, పార్టీ శ్రేణులకు అండగా నిలిచి పోరాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. గతంలో జరిగిన తప్పిదాలు మరిచి, విభేదాలు పక్కనబెట్టి వాటిని సరిదిద్దుకొని భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రజా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే 24 గంటలు అందుబాటులో ఉండి పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని, ప్రతి కార్యకర్త, నాయకుడు పార్టీకి ముఖ్యమే అన్నారు. ప్రజలతో మమేకమై ముచ్చటించిన డైమండ్ బాబు ప్రతి ఒక్కరి సమస్యలు విని సానుకూలంగా స్పందించడంపై పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బండారుపల్లి గ్రామ సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ దాసరి రాజు, మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దానం వినోద్, నల్లిబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఫణిదరం నాయకులు తిరుపతి వెంకయ్య, రత్తయ్య, వెంకటేశ్వర్లు గరికపాడు నాయకులు గడ్డం మురారి, గరికపాటి సాంబశివరావు, దాసరి చెన్నకేశవులు, కిషోర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: అత్యవసర మరమ్మతుల నిమిత్తం నేడు తాడికొండ 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని మోతడక 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ వ్యవసాయ ఫీడర్ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ ఏఈ ఎస్.నాగ మల్లేశ్వరరావు తెలిపారు. కారణంగా ఫీడర్ పరిధిలోని మోతడక, నిడుముక్కల, బడేపురం, లచ్చన్నగుడిపూడి, ముక్కామల, పొన్నెకల్లు, రావెల గ్రామాల పరిధిలో ఉదయం 9:30 నుంచి 11:30 వరకు అంతరాయం కలగనుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు.

పేదల నుంచి అర్జీలు స్వీకరణ



తాడేపల్లిరూరల్: సీపీఐ రాష్ట్రశాఖ పిలుపు మేరకు బుధవారం తాడేపల్లి ప్రకాష్ నగర్ సీపీఐ కార్యాలయంలో ఇళ్లులేని పేదల నుంచి స్థానిక నాయకులు అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య, సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్యలు మాట్లాడుతూ ఇళ్లులేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు.చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం అధికారంలో వస్తే పట్టణాల్లోని పేదలకు 2 సెంట్లు, గ్రామాల్లో నివసించే పేదవారికి 3 సెంట్ల ఇంటి స్థలం కేటాయించి, ఇళ్లను తామే నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీపీఐ నాయకులు షేక్ బాషా, ప్రసాద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు

- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్
- డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తాడికొండ తహసీల్దార్ కె.నాసరయ్య సత్కార సభ



తహసీల్దార్ నాసరయ్యను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

తాడికొండ: అంకితభావంతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు తప్పక ఉంటుందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. తాడికొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.నాసరయ్యకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి వచ్చిన సందర్భంగా జరిగిన సత్కార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కీలకమైన రెవెన్యూ విభాగంలో పనిచేయడం అంటే అంత సులువైన పని కాదని అందరితో మమేకంగా ఉంటూ, ఆయన వివాదరహితంగా విధులు నిర్వహించారని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తహసీల్దార్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించగా కార్యాలయ సిబ్బంది నాసరయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకులు కొమ్మినేని రామచంద్రరావు, తలశిల ప్రసన్న, గుంటుపల్లి మధుసూధనరావు, కంచర్ల శివరామయ్య, యెడ్డూరి హనుమంతరావు, ఎంపీడీఓ కె.సమతావాణి, సీఐ కె.వాసు, డీటీ హనుమంతరావు పలువురు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భావనారుషి స్వామి కల్యాణోత్సవాలకు అంకురార్పణ



'అంకురార్పణ'లో దేవస్థానం కమిటీ, పద్మశాలి సంఘ నేతలు

తెనాలి: పట్టణ షరాఫ్ బజార్‌లోని శ్రీ భద్రావతీ సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 17వ తేదీ వరకు ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 30వ తేదీన శ్రీస్వామి వారిని పెండ్లి కుమారుడిని చేస్తారు. అదే రోజు రాత్రి ధ్వజారోహణ ఉంటుంది. 31న నెమలి వాహనోత్సవం, ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం నెమలి వాహనోత్సవం, రాత్రి పొగడ మానోత్సవం, 2వ తేదీన రాత్రి శ్రీ స్వామి వారికి భృంగీశ్వర వాహనోత్సవం, అమ్మవారికి గజవాహనోత్సవం వేడుకగా చేస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ తెల్లవారుజామున కల్యాణోత్సవం జరుగుతుంది. అదేరోజు సాయంత్రం పులి వాహనోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన సన్నాహాల్లో భాగంగా దేవస్థానం వద్ద అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ చిన్నం హరిగోపాల్, పద్మశాలి వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, తెనాలి పద్మశాలి యూత్ నాయకులు గుంటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ



ఫిరంగిపురం: మండంలకేంద్రంలోని సెయింట్ పాల్స్ ఆడిటోరియంలో బుధవారం పదోతరగతి విద్యార్థులకు ఎస్టీయూ రాష్ట్రశాఖ రూపొందించిన స్టడీమెటీరియల్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన మెటీరియల్ విద్యార్థులకు సులభతరంగా అర్థమవుతుందన్నారు. దీనిద్వారా అత్యధిక మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. పుస్తకాల ప్రింటింగ్ కోసం నుదురుపాడులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఇన్యాసమ్మ ముందుకు రావడం విశేషమన్నారు. అనంతరం స్టడీ మెటీరియల్ పుస్తకాలు 500 మంది విద్యార్థులకు అందజేశారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాద్, ఎంఈఓలు ఎస్‌కే. మహబూబ్ సుభాని, రవికాంత్, ఎస్టీయూ శాఖ జిల్లా అధ్యక్షుడు పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు పొలడుగు ప్రసాద్, కార్యదర్శిసుందరరావు, హెచ్‌ఎం శౌరయ్య, పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రారంభమైన మిర్చి కోతలు



కోతల అనంతరం కల్లాల్లో ఆరబోసిన మిరప కాయలు

తాడికొండ: ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో మిర్చి పంట దిగుబడి అధికంగా ఉంది. దీనికి తోడు కాయలు కోతకు రావడంతో మండల పరిధిలోని రావెల, పాములపాడు, బేజాత్పురం, బండారుపల్లి, ఫణిదరం, గరికపాడు, దామరపల్లి, పొన్నెకల్లు గ్రామాల్లో మిర్చి సాగు చేసిన రైతులు కోతలు ప్రారంభించారు. కల్లాల్లో ఆరబోసి రాత్రిళ్లు కాపలా ఉంటున్నారు. నిన్నమొన్నటి వరకు ఆశాజనకమైన ధర న్న మిర్చి ఇటీవల కాలంలో ధరలు పూర్తిగా పతనమై, రూ.10 వేలు మాత్రమే పలుకుతుండటంతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వైరస్ తెగుళ్ల నుంచి పంటను కాపాడుకొని ఎలాగోలా పంటను కాపాడుకుంటే ధరలు పతనమవడం తమకు నష్టాలకు దారితీస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

29, 30 తేదీల్లో టాక్సీకాలజీ పై జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల యూజీసీ జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య వి. వెంకటరత్నమ్మ తెలిపారు. రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీ అనే అంశంపై ఈనెల 29, 30 తేదీలలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.బ్రోచర్‌ను బుధవారం యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ సదస్సు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ జాతీయ సదస్సు నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వెంకటరత్నమ్మ మాట్లాడుతూ జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న పరిశోధకులు, అధ్యాపకులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు తమ పరిశోధన పత్రాలను ఈనెల 25వ తేదీలోగా సమర్పించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. వీరయ్య, ఆచార్య సునీత, ఆచార్య పీవీ కృష్ణ, ఆచార్య జగదీష్ నాయక్, ఆచార్య పద్మావతి, పరిశోధకులు పాల్గొన్నారు.

ఆండాళ్ అమ్మవారికి సారె సమర్పణ

నగంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీపద్మావతి ఆండాళ్‌సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస సేవా కాలం సందర్భంగా బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి మహిళా గోష్ఠి ఆధ్వర్యంలో శ్రీఆండాళ్ అమ్మవారికి సారె సమర్పించారు. సభ్యులు వెంకటసుబ్బమ్మ, కనకరత్నం, సత్యవాణి, శ్రీలక్ష్మి, దేవస్థానం ఈవో సుభద్ర పాల్గొన్నారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశి ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు.